
# ప్రాబ్లం కేస్

"డాక్టరు బాబూ - బాబూ" వెయిటింగ్ రూం నుండి దీనంగా పిలుపు, పిలుపు వెంట మూలుగు కన్సల్టింగ్ రూంలో రోగిని చూస్తున్న డాక్టర్ జయసింహకు వినపడ్డాయి.



రోగికి ప్రిస్క్రిప్షన్ రాసి ఇచ్చే లోపలే బక్కగా కళ్ళలో ప్రాణం వున్న వ్యక్తి రెండు చేతులూ జోడించి లోపలకు వచ్చేసాడు.

"బాబుగారూ మా సుందరికి ఏదో పెద్ద జబ్బే వచ్చింది. చాలా సీరియస్‌గా వుంది. మీరు వెంటనే చూసి సుందీని కాపాడాలి" పీల గొంతుతో అన్నాడు.

జయసింహ సైగ చేస్తే నర్సు వెళ్ళి సుందరిని లోపలకు తీసుకు వచ్చింది.

ఒక్కసారి జయసింహ కళ్ళు మిరుమిట్లు గొలిపాయి. ఆ పాద మస్తకం వివిధాభరణాలు ధరించి నడిచి వచ్చే నగల కొట్టులా వుంది సుందరి.

నక్షత్రాల కాంతిని పరిహసించే వెలుగుసు వెలార్చు తున్నాయి. ఆమె ఒంటి మీద వున్న రవ్వలు.

ఎంతో నీరసంగా వున్నట్లు కనపడుతున్న సుందరి కళ్ళు రవ్వలకంటే ఎక్కువగా చురుక్కున మెరిసాయి.

"ఎందుకు నవ్వుతున్నావు!" గిరుక్కున వెనుదిరిగి చురుక్కున నర్సు వంక చూస్తూ అంది సుందరి.

"లేదమ్మా-" తడబడుతూ తెల్ల ముఖం వేసి అన్నది నర్సు.

"నాకు తెలుసులే నువ్వెందుకు నవ్వుతున్నావో. చావడానికి సిద్ధంగా వున్న మనిషి ఇన్ని నగలెందుకు పెట్టుకుందీ అని నవ్వుతున్నావు! అవునా?" గద్దించింది సుందరి. నర్సు ముఖంలో కళ తగ్గడం చూడనట్లు తల పక్కగా తిప్పాడు జయసింహ.

రత్నాలు , పచ్చలు , గోమేధికాలు , పుష్యరాగాలు, మరకత మాణిక్యాలు నింపుకున్న వివిధాభరణాలు ధరించినా రవ్వలు ఎక్కువగా వుండడంతో ఆకాశంలో పాలవెల్లి నేలమీదకు దిగివచ్చిన భ్రాంతి కలిగింది జయసింహకు.

కొప్పులో, పాపిడిలో, ముక్కు చెవులకు మెడలో భుజాలకు నమికీకు చేతులకు, నడుముకు, పాదాలకు, ఒంటి మీద ఎక్కడెక్కడ నగలు తగిలించడానికి వీలుంటుందో అక్కడంతా నగలు దిగవేసుకున్నది సుందరి - ఉత్సవాలకు అలంకరించుకున్న దేవతా విగ్రహంలా.

"బాబుగారూ - పోయే ప్రాణాలు నిలుపుకోవాలన్న ఆశతో ఈనగలు వేసుకుంటున్నా" అన్నది సుందరి జయసింహ కళ్ళల్లోకి చూస్తూ.

తన చూపుల్లో వ్యక్తమవుతున్న ఆశ్చర్యాన్ని బలవంతాన అణచుకున్నాడు జయసింహ.

"బెజవాడ సిద్ధాంతిగారు నా ఒంటికి రత్నాలు ధరిస్తే మంచిదన్నారు జాతకం చూసి, తెనాలి సిద్ధాంతి గారు గోమేధికాలన్నారు. గుంటూరాయన పుష్య రాగాలు నీ ఒంటికి ఆరోగ్యం యిస్తాయి అన్నారు. ఒంగోలాయన మరకతాలు, నెల్లూరాయన మాణిక్యాలని చెప్పారు. మద్రాసులో నాడీ జోస్యుడు 'సుందరాంబా రవ్వలను మించిన వస్తువులే'దన్నారు.

ఏ పుట్టలో ఏ పాముందోనని అన్ని రకాల రాళ్ళతో నగలు చేయించారు మా వారు.

'ఈ నగలన్నీ నేనెక్కడ పెట్టుకోనండీ' అని బాధపడ్డా. మా వారు 'కాదు సుందీ జబ్బు మనిషివి - ఇన్నాళ్ళ మంచీ కాయిలా పడి వున్నావు! సిద్ధాంతుల మాటలు తేలికగా తీసుకోకు. బరువనుకోక నగలన్నీ పెట్టుకో" అని బతిమిలాడారు.

ఆయన మాట కాదనలేక ఈ నగలు పెట్టుకుం టు న్నా గాని సరదా కోసం పెట్టుకోవడం లేదు" విష్తారంగా చెప్పింది సుందరి.

అవకాశం ఉపయోగించుకోవాలనుకున్న నర్సు "అందరికీ అంత అదృష్టం దొరుకుందామ్మా!" అన్నది.

'ఏమదృష్టంలే నర్సమ్మా! గాడిద మోసినట్లు ఇంత బరువు మోయడమే అదృష్టమా?' ఉస్సురంటూ నిట్టూర్చింది సుందరి.

నర్సు వదలిపెట్టకుండా "అంత ప్రేమగా వారు చేయించి పెట్టారు - వేసుకోండమ్మా - అయినా

**డాక్టర్. కె. రవీంద్రబాబు**

భార్యను అంత యిదిగా చూసే భర్తలెంత మంది వుంటారేమ్మా?'' అంది సాగదీస్తూ.

"నగలు పెట్టుకోగానే జబ్బులు తగ్గుతాయంటావా నర్సమ్మా?'' అంది సుందరి నిర్లిప్తంగా.

"బల్ల మీద కూర్చోమ్మా నీ పేరు?'' అన్నాడు జయసింహ నిసుగును మనసులోనే అణచుకుంటూ.

చెప్పు అన్నట్లు భర్త వంక చూసింది సుందరి.

"రత్న సుందర కనకమహాలక్ష్మి'' అన్నాడామె భర్త.

"ఏమి జబ్బమ్మా మీకు?''

"ఏమని చెప్పమంటారు? మద్రాసు అపోలో ఆస్పత్రి, బొంబాయి జస్లోక్ ఆస్పత్రి, రాయవెల్లూరు, హైద్రాబాదు అన్నీ తిరిగాం. నా జబ్బేమిటో ఏ డాక్టరూ కనుక్కోలేకపోయారు. ఎక్స్‌రే ఫోటోలు తీశారు. ఒళ్ళంతా స్కానింగ్ చేశారు. బకెట్‌తో నూతిలో నీరు తోడినట్లు నంట్లో రక్తం అంతా తోడి ఎన్నో పరీక్షలు చేశారు. నా రోగం అంతు చిక్కలా'' అంది రొప్పుతూ. సుందరి భర్త అవునన్నట్లు తలూపాడు - వంత పాటగాడిలా.

"అట్టా చూస్తూ నిలబడతావేం? రిపోర్టులూ, ఫోటోలూ డాక్టరు గారికి చూపించు'' గద్దించింది సుందరి భర్తను.

సుందరి భర్త కొరడా దెబ్బతిన్న గుర్రంలా చురుక్కున వెళ్ళి వెయిటింగ్ హాల్లో వున్న సూట్‌కేస్ తీసుకు వచ్చాడు.

ఇంద్రజాలికుని పెట్టె నుండి వివిధ వస్తువులు వెలికి వచ్చినట్లు సూట్‌కేస్ నుంచి రిపోర్టుల కట్టలు, ఎక్స్‌రే ఫోటోలు, స్కానింగ్ రిపోర్టులు, ఇసిజి చుట్టలు, కన్సల్టింగ్ టేబిల్ మీద నిండి పోయాయి.

వాటన్నిటినీ పరిశీలించిన జయసింహ కళ్ళు అలసటతో సుందరి వైపు తిరిగి ఇంద్రధనసులోని రంగులలా ఆమె నగల నుండి వెలువడు తున్న రంగులతో మరింత చెదరి తలవంచుకొని కనులు నలుముకున్నాడు.

"చూశారా డాక్టరు గారూ- నా రిపోర్టులన్నీ చూసారా? ఎన్నో లక్షలు ఖర్చుపెట్టాం- ఏం లాభం - నా జబ్బేమిటో కనుక్కోలేకపోయారు'' బాధగా అంది సుందరి.

"నీ కంప్లయింట్సు ఏమిటో చెప్పమ్మా'' అడిగాడు జయసింహ- అతని మనసులో బయట వెయిటింగ్ రూంలో నిరీక్షిస్తున్న రోగుల మీద జాలి నిండి పొసిగింది.

"చెప్పనయ్యా చెప్పు- చెట్టల్లే అట్టా నిలబడతావేం? దేశంలో వున్న డాక్టర్లందరికీ చెప్పీచెప్పీ నా నోరు పడి పోయింది! అందుకే మూల్పూరు సిద్ధాంతి 'అశ్వియుజంలో ముత్యాలు హారాలు పెట్టుకున్నావు- అందుకే అనారోగ్యం వచ్చింది' అన్నారు.'' పంతులు గారి ముందు భక్తిగా పాఠం అప్పజెప్పే పిల్లవాడిలా చెప్పుకు పోసాగాడు సుందరి భర్త.

"తినకపోతే ఆయాసం, తింటే నీరసం. కూర్చుంటే దడ, పడుకుంటే వణకు. పని చెయ్యలేదు''

"అవు! అట్టాగేనా చెప్పేది?! అట్టా చెబితే డాక్టరు బాబుకి నా జబ్బెలా అర్థం అవుతుంది? తప్పేదేముంది? నేచెబుతా నుండండి! పొద్దున్నే పదింటికి నిద్ర లేస్తానా- అప్పటికప్పుడు ప్రాణం పోయేంత నీరసం అనిపిస్తుంది. ఒకేపున ఆయన ఒకేపున వంట మనిషి చేరి కాఫీ తాగమని బలవంతం చేస్తారు. 'పూరుకోండి నాకు నీరసంగా వుంది. నన్ను బలవంతం చెయ్యొద్దు' అని అంటా. ఊహూ, వినిపించుకోరు. 'నుంచీ గుక్కెడు కాఫీ తాగు నీరసం తగ్గుతుంది' అంటారాయన. "వేడి వేడిగా ఇడ్లీలున్నాయి. నాలుగు తినమ్మా'' అంటుంది వంటావిడ. ప్రాణం పోతున్న మనిషి ఇడ్లీలెలా తింటుంది? కాఫీ ఎలా తాగుతుంది? వెర్రి నోరు కొట్టుకొని లబలబలాడతా! వింటేనా! ఇక వాళ్ళకు చెప్పలేక నాలుగిడ్లీలు నోట గుక్కుకుని కాఫీ తాగుతా. ఇక చూసుకోండి డాక్టరు గారూ- నా బాధ యములాళ్ళకు కూడా వద్దు! గుండెలో ఒకేసారి ఎదురు బొదురుగా రెండు కరెంటు రైలింజన్లు పరుగెత్తి ఢీకొన్నట్టు విపరీతమైన శబ్దం వస్తుంది. భయంతో పిచ్చి కేకలు పెడతా. అట్టా ఎంతసేపు అరుస్తానో నాకే తెలియదు. అరచి అరచి సొమ్మసిల్లి పడిపోతా.

ఏ రొంటి గంటకో లేచి లేని ఓపిక తెచ్చుకొని ముఖం కడుక్కుని స్నానం చేసి సోఫాలో జేరగిలబడి పోతా. పోతాయనుకున్న ప్రాణాలు ఎలా నిలిచాయో అర్థం కాక నేను ఆశ్చర్యపడుతుంటే వంటావిడ్నా, పని పిల్లా, ఈయనా కోరస్ మొదలెడతారు అన్నం తినమని. ప్రాణం పోయేట్లున్న మనిషి అన్నం ఎలా తింటుంది చెప్పండి అయినా వదిలి పెట్టకుండా వేధించుకు తింటారు వాళ్ళు ముగ్గురూ.

వాళ్ళ గోల భరించలేక ఎలాగో నాలుగు ముద్దలు తింటా. కాని భోజనం బల్ల దగ్గరే సొమ్మసిల్లి పడిపోతా. వున్న కాస్త వూపిరి అన్నం తినడానికి ఖర్చయిపోతే సోషరాక ఏమవుతుంది చెప్పండి?!

ఎట్టాగో అందరూ కలిసి తీసుకువచ్చి మంచం మీద పడవేస్తారు.

పరుపు మీద వాలి నాతం చేసిన గొడ్డు రొప్పినట్లు

రొప్పీ రొప్పీ పక్కటెముకలు విరిగిపోతాయా అని భయం పట్టుకుంటుంది.

ఒక పక్క రొప్పు ఒక పక్క భయం - గిలగిలలాడి పోతా.

"ఏ మయిందే సుందీ?'' అంటారాయన.

సమాధానం చెప్పడానికి ఓపిక వుంటేగా? అలాగే పడి వుంటా. తంతనుగా నాలుగయ్యేసరికి వంటావిడ గండికొట్టినట్టు 'జీడి పప్పు వేసి ఉప్మా చేశాను - వేడిగా వుంది. కాస్త తిని బత్తాయి రసం తాగమ్మా' అంటుంది.

నోటితో చెప్పటానికి నోపిక లేక తల అడ్డంగా తిప్పుతా.

"బత్తాయి రసం ఇష్టం లేకపోతే ఏపిల్ జ్యూస్ తాగమ్మా'' అంటుంది.

ఏపిల్ జ్యూస్ కాదు బంగారం కరగించి ఇచ్చినా తాగడానికి ఓపిక వుండొద్దూ?

ఇక ఆ గోల భరించలేక ఆమె నిదిస్తే అది తిని, కళ్ళు బైర్లు గమ్మి పడిపోతా.



"ఏమయిందో చెప్పవే సుందీ!" అంటూ మళ్ళీ మళ్ళీ అడుగుతాడాయన.

'పూరికే విసిగించకండి' అని అందామనుకుంటా కాని అంతలోనే "నేను పోయాక ఆయన ఆలనాపాలనా కనుక్కొనే వాళ్ళు వుండరు. పాపం ఒంటరిగా ఎన్ని అవస్థలు పడతాడో ఏమో?" అని ఆయన మీద విపరీతమైన జాలి వేస్తుంది.

అందుకే ఎంత విసిగించినా ఏమి అనను. ఇంతలో చీకటి పడిపోతుంది.

"చీకిష్టమని కాకరవేపుడు కారట్ చెట్నీ చేశానని మొదలెడుతుంది వంటావిడ.

వద్దని తలూపుతా.

"ఏమీ తినకుండా ఎలా వుంటావే?" అంటూ గోలెడతారాయన.

నాలుగు ముద్దలు తిని వచ్చి మంచం మీద పడిపోతా.

'ఈ రాత్రి తెల్లారదు' అనిపిస్తుంది. నిద్ర అయిందీ, మృత్యువు అయిందీ తెలీకుండా పడి వుంటా!

మగత తెలిసే సరికి తెల్లారి పది గంటలు కొడుతుంటుంది గడియారం!"

కనురెప్పలాడించి చెప్పటం ఆపి పక్షి రెక్కలు విదిల్చినట్లు రొప్పసాగింది సుందరి.

"కంప్లైయింట్స్ చెప్పమంటే దినచర్య చెబుతుందేమిటి" అని మనసులో ఆశ్చర్యపడిన జయసింహాతో సుందరి భర్త "డాక్టరు గారూ - మా సుందరి మొహమాట పడి చెప్పడం లేదు గాని గుండె నొప్పితో బాధపడుతూందండీ" అన్నాడు.

"అవన్నీ ఎందుకు చెప్పమంటావు? నా బాధలు ప్రాణం పోయాక పోవాల్సిందే!" అన్నది సుందరి నిర్లిప్తంగా.

"చెప్పు సుందీ" బతిమిలాడాడు భర్త.

గంటకొట్టినట్లు చెప్పుకుపోసాగింది సుందరి.

"అటు మొన్న గుండెల్లో పోటు, మొన్న తీవ్రంగా నొప్పి, నిన్న పెద్దగా బాధ, ఇవాళ భరించలేనంత తీపు, రేపు ఏం వస్తుందోనన్న భయం - మీ ఆస్పత్రి దాకా కూడా వస్తాననుకోలేదు డాక్టరు గారూ!"

అప్పటికి సుందరి కన్సల్టింగ్ రూంలోకి వచ్చి గంట దాటడంతో బయట వెయిటింగ్ రూంలోని రోగులలో అలజడి ఎక్కువైంది.

జయసింహ మొక్కుబడి తీర్చడానికన్నట్టు సుందరిని పరీక్షించి మందులు రాయడానికై పెన్ తీసుకున్నాడు.

"ఆగండి డాక్టరు గారూ" సుందరి అరుపు విని ఆగిపోయాడు.

"నేను మందు బిళ్ళలు మింగలేను - మింగితే గొంతుకడ్డంబడి ఉక్కిరిబిక్కిరి అయిపోతా"

"ఇంజక్షన్ రాయమంటారా?" అని అడిగాడు జయసింహ.

"నా తత్వానికి ఇంజక్షన్ సరిపడదు వికటిస్తుంది" జయసింహ తెల్లమొహం వేయడం గమనించిన నర్సు కలుగజేసుకొని "పోనీ టానిక్ రాసివ్వమంటారా?" అంది.

"హమ్మో! టానిక్కా? నాసన చూస్తేనే డోకొస్తుంది. వస్తా డాక్టరు గారూ- మళ్ళీ వస్తాలెండి బతికి బాగుంటే!" "అలా చూస్తావేం! డాక్టరు గారికి ఫీజు ఇవ్వు. అవతల చాలా మంది రోగులు కాచుకు కూర్చున్నారు" అంటూ గభాలున బల్ల దిగి చకచక నడుచుకుంటూ వెళ్ళిపోయింది.

కన్సల్టేషన్ ఫీజు నర్సుకిచ్చి వెళ్ళిపోయాడు సుందరి భర్త.

ఆ రోజు నుంచి అడపా దడపా సుందరి భర్త జయసింహ కన్సల్టింగ్ రూములకు వచ్చి గంటసేపు భార్య అనారోగ్యం గురించి ఏకరువు పెట్టి వెళ్తూ ఆఖర్లో "మీ మీద సుందీకి బాగా గురి కుదిరింది. అందుకే 'పోయి నా జబ్బు సంగతి జయసింహ డాక్టరు గారికి చెప్పిరా ఎంత నోపిగ్గా విన్నాడు' అంది." అని చెప్తుండేవాడు.

వేళగాని వేళల్లోనూ బిజీగా వున్నప్పుడూ ఫోన్ చేసి భార్య బాధలు ఏకరువు పెట్టి జయసింహకు తలనొప్పి తెప్పించసాగాడు సుందరి భర్త.

జయసింహకు అతను ఎదురు పడినా ఫోన్‌లో అతని గొంతు విన్నా గుండెదడ పుట్టసాగింది.

అలాంటిది సుందరి గానీ ఆమె భర్తగానీ నెల రోజులు కనపడకపోయేసరికి "అమ్మయ్య పీడా వదలిపోయారు! వాళ్ళ సొద వినడానికి ఏ డాక్టరు దొరికాడో పాపం!" అనుకున్నాడు జయసింహ.

క్లినిక్ నుండి ఇంటికి వెళ్తూ బట్టల దుకాణం వద్ద ఆగాడు జయసింహ.

షాపులో నియాన్ లైట్లను అపహాస్యం చేస్తూన్న సుందరి ఆభరణాలు విరజిమ్ముతున్న వెలుగు చూసి వెనుదిరిగి రాబోయాడు.

"డాక్టరు గారూ"

జయసింహ సుందరి పిలుపు విని ఆగక తప్పలేదు.

"ఏమ్మా వంట్లో ఎలా వుంటోంది?" మర్యాదకు అడిగాడు జయసింహ.

"రోజూ చచ్చేదానికి పిడ్వడమెందుకని జబ్బు సంగతి పట్టించుకోవడం మానేసా!"

"అలాగా - మీవారేరీ?"

"మీకింకా తెలియదా ఆయన అకస్మాత్తుగా చనిపోయారు - నెల రోజుల క్రితం మీ ఆస్పత్రి నుంచి ఇంటికి వస్తూంటే దారిలో గుండె నొప్పి వచ్చి పోయారు! ప్రాణం పోయాక డాక్టర్లేం చేస్తార్లే అని శవాన్ని ఇంటికి తీసుకెళ్ళిపోయా!

ఆయన కోరిక ప్రకారం నగలన్నీ పెట్టుకునే తిరుగుతున్నా! ఆయన పోయాక నా ఆలన కనుక్కునే వాళ్ళెవరున్నారు చెప్పండి. అందుకనే ఆస్పత్రికి రావడంలా!"

సుందరి భర్త పోయినందుకు సానుభూతి చూపాలో, లేక సుందరి జబ్బు నయమైనందుకు అభినందించాలో తెలియక నిశ్చలంగా వుండిపోయాడు డాక్టరు జయసింహ.

## అకాషత్



ఎటు చూసినా యిసుక పర్రలు
అక్కడక్కడ అనే చిన్నా పెద్దా గుట్టలు!
దూరంగా బాగా బలిసిన గొర్రెల మంద
దర్జాగా కంచరగాడిదపై కూర్చున్న * రఫిక్!
మందచుట్టూ తిరుగాడే పెంపుడు కుక్కలు
ఇటు పక్క దగ్గరలోనే వుందనిపించే* మంజ్యం!
ఎక్కడా కనుపించని చెట్టూ చేమ
సరసంచారం లేని భయంకర సీమ!
దాన్నే అంటారు ముద్దుగా "అకాషత్"
ఆ పేరు వినితేనే ప్రాజెక్ట్‌లో అందరికీ హడల్!!
పగలు ఎండాకాలం భానుడు
సెగల పగలు కక్కుతాడు!...
జిగిజిగేల్ మంటాయి దూరంగా
మరీచికలు మిథ్యకి చిహ్నంగా!
పగలు చిలికే చందమామ
మరీ చేతిలో వెన్నముద్ద అవుతాడు!
వేగంగా వీచే చల్లని గాలికి
ఎడారి మొక్కలు అల్లన వూగుతుంటాయి —
రకరకాల పువ్వుల రంగులతో అవి కూడ
సృష్టిస్తాయి 'హరివిల్లు' నేల మీద!!
కాకపోయినా యిది కాకులు దూరని కారడివి
ఎప్పుడో కనిపిస్తుంది తెగబలిసిన కాకి!
గుంపులు గుంపులుగా విహరించే కపోతాలు
గమ్మత్తుగా వినిపిస్తాయి సంగీతాలు!
నీరైన వాతావరణంలో దొరుకుతుంది యిక్కడ
ఘాటైన ప్రశాంతత మరి!!
నా దేశం గొప్పది అని ఎలుగెత్తే కంటే
'ఈ విశ్వం అంతా గొప్పదే మరి' అంటే ?!
చూసే కనులకు మనసు వుండాలే గాని
జగమే ఓ బృందావనం ఔతుంది!
(* పరదేశ స్నేహితుడు * ఫ్యాక్టరీ)

— అచ్చి రఘురామరెడ్డి (ఇరాక్)